

సీడీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుపై మొండిచేయి..



కొబ్బరి అభివృద్ధి కోసం రైతులకు సాయపడేందుకు కేంద్ర ప్రభుత్వం స్థాపించిన కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రధాన కార్యాలయం కేరళలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి సంబంధించి సీడీబీ కార్యాలయాన్ని కోనసీమలో ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా రైతులు కోరుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు.

దొమ్మేటి సత్యమోహన్, రైతు, మాచవరం

14,15 తేదీల్లో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) సౌజన్యంతో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, ప్రధాన కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో మెన్ అండ్ ఉమెన్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన యెనుముల కృష్ణపద్మరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొమ్మేటి వెంకటరమణలను ఘనంగా సత్కరించారు. ముత్తాబత్తుల వెంకటరమణ, పొణకల దుర్గాప్రసాద్, తిక్కా మురళీ, కట్టా బుజ్జి, మట్టపర్తి సముద్రం, కె.రవిసుధీర్, ఎస్కే. వలీబాబా, జిమ్‌కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు: కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ జారీచేసిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా వర్షపాతం వివరాలు

అమలాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధికంగా రాయవరం మండలంలో 48.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కాట్రేనికోనలో 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం జిల్లాలో సగటున 26.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం మండలంలో 25 మిల్లీమీటర్లు, మండపేట 33.4, రామచంద్రపురం 13.2, ఆలమూరు 34.2, రావులపాలెం 42.4, కొత్తపేట 14.2, కపిలేశ్వరపురం 28.2, కె.గంగవరం 17.6, ఐ.పోలవరం 15.8, ముమ్మిడివరం 24.4, అయినవిల్లి 24.4, పి.గన్నవరం 16.8, అంబాజీపేట 42.8, మామిడికుదురు 22.2, రాజోలు 24.8, మలికిపురం 42, సఖినేటిపల్లి 37.2, అల్లవరం 24.2, అమలాపురం 29.6, ఉప్పలగుప్తం మండలంలో 14.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు యథావిధిగా గ్రీవెన్స్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా అధికారులు అర్జీలను స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.

అధిక వర్షాల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు

ప్రయాణికుల అవస్థలు ..7లో

కోనసీమ..కొబ్బరి

నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం



నింగికి చుక్కలు అందం... నేలకు మొక్కలు అందం. పుడమిని వర్ణచిత్రంగా మార్చేవి.. మానవ జీవితానికి పుష్టిని సమకూర్చేవి మొక్కలే. అలాంటి మొక్కల్లో నేల తల్లి ఎగరేసిన హరిత ధ్వజం లాంటి కొబ్బరికి విశిష్ట స్థానం ఉంది. కొబ్బరి కాయ అన్నా.. టెంకాయ అన్నా.. ఆ ఫలం దైనందిన జీవితంలో ఒక భాగం. దానిలో భాగంగా కోనసీమను చూస్తే.. గోదారమ్మ ఒడిలో ఒదిగిన అందాల బిడ్డలా ఉంటుంది. ఆ గడ్డ అంతటా పరుచుకున్న కొబ్బరి. ఆధ్యాత్మిక జీవనానికే కాకుండా.. ఈ సీమ నుదుట ప్రగతి తిలకం దిద్దడంలోనూ ఈ కొబ్బరే విశిష్ట పాత్ర పోషిస్తోంది. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

● అంబాజీపేట

తెలుగు వారికి కొబ్బరి అనగానే కోనసీమ గుర్తుకు వస్తుంది. ఉభయ గోదావరి జిల్లాలు విరివిగా కొబ్బరి పండిస్తే తూర్పుగోదావరి జిల్లానే మొత్తం రాష్ట్ర పంటలో సగం వరకూ పడుతుంది. అందులోనూ ఎక్కువ వాటా కోనసీమదే. నేల నాణ్యత, అధికతేమ, వర్షపాతం వంటి అంశాలు కోనసీమలో కొబ్బరి సాగుకు ఎంతగానో తోడ్పడతాయి. పైగా ఇక్కడి కొబ్బరి రైతులు కొబ్బరి చెట్లతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారు. వాటిని తమ కుటుంబ సభ్యులు లాగా చూసుకుంటారు. నిజానికి ఒక కొబ్బరి చెట్టు కొడుకుతో సమానమని చెప్పుకొంటారు. అంటే ఒక కొబ్బరిచెట్టు ఉంటే కుటుంబాన్ని సునాయాసంగా ముందుకు తీసుకెళ్లవచ్చుననే భావం. అయితే ఇప్పుడు కోనసీమలో ఉన్న 16 మండలాల్లో కొబ్బరి సాగు తగ్గుతోంది. ప్రభుత్వపరంగా సరైన ప్రోత్సాహం లేక రైతులు నిరుత్సాహపడుతున్నారు. అదీకాక సకాలంలో కురవని వర్షాలు.. తుఫాన్లు ఇతర వాతావరణ ప్రతికూలాంశాలు కూడా లాభాలను మింగేశాయి. వీటికి తోడు పక్కనున్న కేరళ, తమిళనాడు నుంచి మన రాష్ట్రాల్లోకి చవకగా వచ్చి పడుతున్న కొబ్బరి కాయలతో రైతులు నెత్తి మీద కొబ్బరి కాయ పడ్డట్టే అయ్యింది. ఎకరానికి పదివేల కాయలు కాసే కోనసీమ కొబ్బరి పంటను ఆధారం చేసుకొని విశేష నైపుణ్యాలు అభివృద్ధి అయ్యాయి. కొబ్బరి చెట్లు ఎక్కే వాళ్లు, కొబ్బరి కాయలను ఒలిచే వాళ్ల వంటి ప్రత్యేకమైన పనివాళ్ల సంఖ్య ఇప్పుడు తగ్గుముఖం పడుతోంది..



సంఘాలతో..

నాలుగు వేల ఎకరాల పరిధిలోని రైతులంతా కోకోనట్ ప్రొడ్యూసర్ సొసైటీ (సీపీఎస్)గా ఏర్పడాలి. తద్వారా సీడీబీ, ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వ రాయితీలను పొందవచ్చు. కొబ్బరి అభివృద్ధి కోసం రైతులకు సాయపడేందుకు కేంద్ర ప్రభుత్వం స్థాపించిన కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రధాన కార్యాలయం కేరళలో ఉంది. రాష్ట్రానికి సంబంధించి సీడీబీ కార్యాలయాన్ని కోనసీమలో ఏర్పాటు చేయాలని రైతులు కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవట్లేదు.

ప్రయోజనాలు చాలా ఎక్కువ

కొబ్బరి సాగు అధికంగా జరిగే కేరళను సైతం మన రాష్ట్రం మించిపోయింది. ఏపీలో సుమారు 3.32 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఏటా 12.70 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. అయినప్పటికీ ఉప ఉత్పత్తులతోనే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సీడీబీ అధికారులు చెప్తున్నారు. ప్రపంచ దేశాల్లో కొబ్బరితో తయారైన ఉప ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. ఈ ఉప ఉత్పత్తులలో కోకో కెమికల్స్, కొబ్బరి పాలు, కొబ్బరినీరు, టెంక, పీచు ప్రధానమైనవి. కొబ్బరితో ప్రధానంగా నాలుగు రకాల ఉత్పత్తులు తయారీ చేయవచ్చు. వాటిలో కొబ్బరి నుంచి ఉత్పత్తులు, కొబ్బరి పీచుతో ఉత్పత్తులు, పచ్చి కొబ్బరి, ఎండు కొబ్బరి, కొబ్బరి నూనె, కొబ్బరి చిప్ప, కొబ్బరి పీచు, కొబ్బరి ఆకులతో వివిధ రకాల వస్తువులను తయారు చేయవచ్చు. వర్జిన్ కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి పొడి తయారీ, కొబ్బరిపాలు, కొబ్బరి క్రీమ్, కొబ్బరిపాలతో పొడి, కొబ్బరి నీరు, కొబ్బరి వెనిగర్, కొబ్బరి పానీయాలు తయారు చేసే పరిశ్రమలను ఈ ప్రాంతంలో నెలకొల్పాల్సి ఉంది. ఈ ప్రాంతం నుంచి ఉత్పత్తి అయిన కొబ్బరి కాయలు కేవలం రైతులు నేరుగా అమ్ముకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఎగుమతులకు అవకాశం

అతి విలువైన కొబ్బరి పీచును కొబ్బరి డొక్కల నుంచి నారు వేరు చేయుట ద్వారా తయారు చేయవచ్చు. పీచుతో ఇతర ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఇలా కొబ్బరి పీచుతో తయారైన వస్తువులకు జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్, కువైట్, స్పెయిన్, టర్కీ తదితర దేశాలకు ఎగుమతికి మంచి అవకాశం ఉంది. గతంలో ఈ పీచు పరిశ్రమల ద్వారా ఆయా దేశాలకు రూ.59.4 కోట్ల విలువైన కొబ్బరి పీచును కాయిర్ బోర్డు ఎగుమతి చేసింది. కొబ్బరి పట్టు వాడకం విదేశాల్లో పెరిగింది. దాదాపు 84 వేల కాయిర్ యూనిట్లతో కేరళ రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: ఇరవై ఏళ్ల క్రితం ఇదే రోజున కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము అమలులోకి వచ్చిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏటా సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా నిర్వహిస్తారని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఎస్టీయూ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలులోకి తీసుకువస్తామని అధికారంలోకి వచ్చి మాట తప్పి మడమ తిప్పడంతో ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు అలుపెరగని పోరాటం చేశామని వివరించారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి మెరుగైన పెన్షన్ స్కీమును అమలులోకి తీసుకువస్తామని ప్రకటించిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పెన్షన్ స్కీమును ప్రకటించి అన్ని రాష్ట్రాల్లోను అమలుచేసే విధంగా ముందుకు వెళుతుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు ఏ విధమైన కంట్రిబ్యూషన్ చెల్లించకుండా పాత విధానంలోనే పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాంబాబు, బోనం గంగాధర్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, తోట బాలకృష్ణ, జిల్లా అదనపు కార్యదర్శులు జనుపల్లి భీమారావు, బీవీవీ సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, కె.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

బకాయిలు విడుదల చేయాలి..

గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, పదవీ విరమణ బెనిఫిట్ బకాయిలను విడుదల చేయలేదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. తక్షణం ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం రూ.15వేల కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీవోను తక్షణం రద్దు చేయాలని డిమాండు చేశారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో తిరిగి కలిపి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియంను కొనసాగించాలన్నారు. సీబీఎస్ఈ విధానంలో కాకుండా గతంలో మాదిరిగా రాష్ట్రస్థాయిలోనే పరీక్షా విధానం నిర్వహించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.



చినశంకర్లపూడిలో ఇండియన్ ఈగల్ ఓవెల్

ప్రత్తిపాడు/ఏలేశ్వరం, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా చినశంకర్లపూడిలో చెనుబోయిన వేణు ఇంటి వద్ద అరుదైన పక్షి కనిపించింది. కోతులు దాడి చేయడంతో స్వల్పంగా గాయపడి ఎగురలేని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు ఏలేశ్వరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఏలేశ్వరం డీఆర్వో శ్యాంసన్ వచ్చి ఈ పక్షిని స్వాధీనం చేసుకున్నారు. గుడ్లగూబ, గ్రద్ధ మాదిరిగి కనిపిస్తున్న ఈ పక్షి శాస్త్రీయ నామం ఇండియన్ ఈగల్ ఓవెల్ అని ఆయన చెప్పారు. బెంగాల్ అటవీ ప్రాంతంలో ఈ జాతి పక్షులు కనిపిస్తాయని, మన రాష్ట్రంలో కనిపించడం అరుదన్నారు. నీరసంగా ఉండడంతో ఎగురలేకపోతోందని, ఆహారం సమకూర్చి ఎగిరే వరకు విశ్రాంతి కల్పిస్తామన్నారు. చెప్పారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ పక్షిని పంజరంలో భద్రపరిచి ఏలేశ్వరంలోని అటవీ సందర్శన కార్యాలయానికి తరలించారు. అక్కడ వైద్యం చేసి లింగంపర్తి అడవిలో విడిచిపెట్టారు.



మూడు పతకాలు సొంతం చేసుకున్న మధు చందన

మధు చందనకు పతకాల పంట

చింతూరు, సెప్టెంబరు 1: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన మధు చందన వెయిట్ లిఫ్టింగ్‌లో ఏక కాలంలో మూడు పతకాలు కైవసం చేసుకుంది. చింతూరు కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మధుచందన అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. ప్లస్-81 కేటగిరీ జూనియర్ విభాగంలో బంగారు పతకం, సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం, సీనియర్ విభాగంలో రజత పతకం సాధించింది.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

భర్త, తోటి కోడలికి గాయాలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో విద్యుత్ షాక్‌తో ఆదివారం ఒక మహిళ మరణించగా, భర్త, తోటికోడలికి గాయాలయ్యాయి. గ్రామంలోని రాణా వారి వీధిలో నివాసముంటున్న పోలవరపు నూకరత్నం(55) ఇంటిలో తడిసిన బట్టలను ఆరేస్తోంది. ఆ సమయంలో ఆ తీగకు కరెంటు ప్రవహించడంతో విద్యుత్ షాక్‌కు గురయింది. వెంటనే నూకతర్నం కేకలు వేయడంతో భర్త నారాయణరావు, తోటి కోడలు సత్యవతి వచ్చి ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తుండగా వారు కూడా షాక్‌కు గురయ్యారు. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నూకరత్నం మరణించింది. మిగిలిన వారు చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

అయినవిల్లి మండలం సిరిపల్లిలో...

అయినవిల్లి, సెప్టెంబరు 1: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిసా రాష్ట్రం నబుగాన్ నవరంగ్‌పూర్ జిల్లా కారగాన బార్‌జాన్ గ్రామానికి చెందిన బలరాం హరిజన్ (22) ఏపీలోని కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం సిరిపల్లికి చెందిన వాసంశెట్టి గిరిధర్ రొయ్యల చెరువు వద్ద పని చేస్తున్నాడు. హరిజన్ శనివారం రాత్రి జనరేటర్ వేశాడు. కరెంటు రావడంతో జనరేటర్ నిలుపుదల చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావమరిది దులార్ హరిజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కేఎం జోషి తెలిపారు.

కూనవరం మండలం మర్రివీడులో...

కూనవరం, సెప్టెంబరు 1: మండలంలోని మర్రివీడుకు చెందిన ఆవుల వెంకటరమణ (28) ప్రయివేటుగా విద్యుత్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై పడిపోయాడు. కోతులగుట్ట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

కాలు జారి చెరువులో పడి యువకుడు మృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనబాద్‌ఎస్సీ పేటకు చెందిన కాకాడ లోవరాజు(29) పెయింటింగ్‌లు వేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం కాళ్లు కడుక్కోవడానికి చెరువులోకి దిగి కాలు జారిపడ్డాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు పూర్తిగా నిండిపోయింది. ఈత రాకపోవడంతో లోవరాజు ఊపిరాడక మృతి చెందాడని అతడి మేనమామ పలివెల నానిబాబు తెలిపారు. మృతుడికి సంవత్సరంలోపు పాప ఉందని, భార్య ఆరో నెల నెల గర్భిణి అని ఆయన చెప్పారు.

వర్షం కారణంగా తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఆటంకం ఏర్పడింది. గన్నవరం వద్ద రైల్వే ట్రాక్ నీట మునగడంతో కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలును రాజమహేంద్రవరంలో రద్దు చేశారు. రైల్వే అధికారుల ఆకస్మిక నిర్ణయంతో దారి మధ్యలోనే ప్రయాణం ఆగిపోవడంతో ప్రయాణికులు ఉసూరుమన్నారు.



నిలిచిపోయిన తిరుపతి రైలు... వెనుదిరుగుతున్న ప్రయాణికులు

తిరుపతి రైలు ఆకస్మిక రద్దు

- రాజమహేంద్రవరంలో నిలిపివేత
- 1,500 మంది ప్రయాణికుల ఆగచాట్లు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు కాకినాడలో ఆదివారం సాయంత్రం బయల్దేరింది. ఐదు గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంది. ఎంతసేపటికీ బయలుదేరకపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. రైలును దారి మళ్లిద్దామనుకుని తాడేపల్లిగూడెం, ఏలూరు వెళ్లే ప్రయాణికులు దిగిపోవాలని చెప్పారు. కానీ రైలును రద్దు చేస్తున్నట్టు 6.30 గంటల సమయంలో ప్రకటించారు. 11 స్లీపరు, 6 ఏసీ, రెండు జనరల్ బోగీల్లో సుమారు 1,500 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లేవారే. రైలు ఆకస్మిక రద్దు ప్రకటనతో దర్శనం కోల్పోయామనే బాధ ప్రయాణికుల్లో కనిపించింది. కొందరు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. టీసీఐ చంద్రమౌళి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించినట్లే రైలును ఆకస్మికంగా దారి మధ్యలో నిలిపేస్తే తమకూ పరిహారం చెల్లించాలని వాదించారు.

రిఫండ్‌కీ ఇబ్బందే...

మాన్యువల్‌గా రిజర్వేషను టికెట్లు తీసుకున్న వాళ్లు రిఫండ్ కోసం రిజర్వేషను కౌంటర్ల వద్దకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. అయితే అక్కడ మూడే కౌంటర్లు ఉండడం, రాజమండ్రి రిజర్వేషను కార్యాలయంలో తీసుకున్న టికెట్లను మాత్రమే రద్దు చేస్తామని చెప్పడంతో ప్రయాణికులు మరింత నీరసించిపోయారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి ఘోరం. తిరుగు ప్రయాణంలో టికెట్లు ఉన్నవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆ టికెట్లకు క్యాన్సిలేషన్ చార్జీలు వసూలు చేయకుండా చూడాలని కోరారు.



రిజర్వేషను రద్దు డబ్బుల కోసం ప్రయాణికుల పాట్లు

సేవ కోల్పోయాం: రోహిణి, కాకినాడ



వేంకటేశ్వరుడి సేవకు తొమ్మిది నెలలుగా ప్రయత్నిస్తే ఇప్పుడు అవకాశం లభించడంతో జన్మ ధన్యమైందని సంబరపడ్డాం. 15 మంది బృందంగా బయల్దేరాం. సోమవారం ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాల్సి ఉంది. కానీ దారి మధ్యలో ఆగిపోయాం. మళ్లీ ఐదు నెలల దాకా మాకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. దారి మళ్లించి అయినా తీసుకెళితే బాగుండేది.

ఎటు వెళ్లాలో తెలియట్లేదు



వీవీ సత్యనారాయణ, రామచంద్రపురం

ఎప్పటి నుంచో తిరుమల వెళ్లాలని అనుకుంటున్నాం. దర్శనం, వసతి దొరకలేదు. జూన్ 24న దొరికాయి. సోమవారం దర్శనం ఉంది. కానీ రైలును అకస్మాత్తుగా ఆపేశారు. ఇక్కడి నుంచి వెనక్కి వెళ్లాలో తిరుపతి వెళ్లాలో తెలియట్లేదు. భార్య, బిడ్డలతో ఇబ్బంది పడుతున్నాం. ముందుగా సెల్‌ఫోన్‌కి మెసేజ్ పంపిస్తే కొంత ఇబ్బంది ఉండేది కాదు.

కొన్ని రద్దు... మరికొన్ని దారి మళ్లింపు

రైలు ప్రయాణికులకు తప్పని అవస్థలు



సామర్లకోట రైల్వే సేషన్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

సామర్లకోట, సెప్టెంబరు 1: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైల్వే శాఖ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. సామర్లకోట మీదుగా అటు విశాఖ ఇటు విజయవాడ రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను నిర్దేశిత రూట్లలో కాకుండా వేరే రూట్లకు డైవర్షన్ చేశారు. రైల్వే ఎస్టీఎం చార్ట్ అధికారి రాజనరసు కార్యాలయం నుంచి సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు ఆదివారం మధ్యాహ్నం ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట చేరుకోవాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముందుగా రిజర్వేషన్ టిక్కెట్లు పొందిన వారికి చార్జీలను వాపసు చేశారు. రైళ్ల రాకపోకలకు చెంది ప్రత్యేక సమాచారం అందించేందుకు ప్లాట్‌ఫామ్-1పై హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు. ఆదివారం రద్దు అయిన రైళ్ల వివరాలు...

హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్.
విశాఖ-హైద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్.
లింగంపల్లి-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-ఎల్‌టీటీ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-మహబూబ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
కాకినాడ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
లింగంపల్లి-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
సికింద్రాబాద్-భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
భువనేశ్వర్-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7న రద్దు చేశారు.

టాటానగర్-యశ్వంత్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే వారాంతపు ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు. ఎగువ ప్రాంతా ల్లో కురిసిన భారీ వర్షాలకు రైల్వే ట్రాక్ నీటి ముంపు కారణంగా సిగ్నలింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయలేదు. అటు విజయవాడ, ఇటు విశాఖ నుంచి పలు రైళ్ల రాకపోకల్లో గంటల తరబడి ఆలస్యం జరిగింది. కొన్ని రైళ్లను నిర్దేశిత వేగం కన్నా తగ్గించి నడుపుతుండడంతో పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. సామర్లకోటలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లో ముగ్గురు సిబ్బందిని నియమించి నిరంతరం సమాచారం అందించేందుకు 0884-2327010 నంబరు కేటాయించారు.

విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆదివారం రాత్రి 7.02 గంటలకు సామర్లకోట చేరుకుంది. నూజివీడు-విజయవాడ మధ్య ట్రాక్ ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో సామర్లకోటలో 2.20 గంటల పాటు నిలుపుదల చేశారు. రాత్రి 9.27 గంటలకు తిరిగి విశాఖపట్నం పంపించారు.



ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. అధిక వర్షాలతో కాలువల ద్వారా వరద నీరు సముద్రంలోకి పోటెత్తుతోంది. కెరటాలు బీచ్ రోడ్డును తాకుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం అనుకూలించకపోవడంతో మత్స్యకారులు వేటను స్వచ్ఛందంగా విరమించారు.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల మధ్య ముకునూరు వద్ద ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు

పొంగిపొర్లిన వాగులు

పరిస్థితిని సమీక్షించిన ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, సెప్టెంబరు 1: ఒకపక్క ఎడతెరపిలేని వర్షం... మరోపక్క ఉధృతంగా గోదావరి, శబరి నదులు... ఇంకోపక్క పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలాన్ని వరద చుట్టుముట్టింది. కల్లేరు, పెద్దసీతనపల్లి, ముకునూరు, రామన్నపాలెం, ఎజికొడేరు పంచాయతీల పరిధిలోని 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. సోకిలేరు, చీకటి వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో చింతూరు, వరరామచంద్రపురం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం 35.5 అడుగులకు చేరింది. వరద పరిస్థితిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ సమీక్షిస్తున్నారు. సోకిలేరు, చీకటివాగు ఉధృతిని ఆయన స్వయంగా పరిశీలించారు. చింతూరు నుంచి ఎజికొడేరు వెళ్లే ఆదివాసీలు జల్లివారిగూడెం వద్ద వాగు దాటేందుకు పడుతున్న అవస్థలను చూశారు. అప్పుడే పెరుగుతున్న వాగు మీదుగా వారందరినీ తన వాహనంలో దాటించారు. ఘాట్‌పై కొండచరియలు, చెట్లు విరిగిపడే ప్రమాదముందన్న కారణంతో రాత్రి సమయంలో చింతూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



తుమ్మిరిగూడెం వాగు వద్ద ఆదివాసీలను తన వాహనంలో దాటిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్



రాజానగరంలో డిజిటల్ క్లాస్ రూమ్‌గా రూపుదిద్దుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రం



పిఠాపురానికి మొక్కలు పంపుతున్న శివ

అభిమానం నిండుగా... అభివృద్ధికి అండగా..

- పవన్‌కల్యాణ్ అభిమానుల వినూత్న ఆలోచన
- రాజానగరం అంగన్‌వాడీ కేంద్రానికి డిజిటల్ మెరుగులు
- 'క్లీన్ పిఠాపురం... గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి కడియం నుంచి మొక్కలు

రాజానగరం/కడియం, సెప్టెంబరు 1: తమ అభిమాన హీరో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన యువకులు వినూత్నంగా ఆలోచించారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా నడుచుకుందామనుకున్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నా కొందరు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకపోవడాన్ని గుర్తించారు. చిన్నారులను ఆకర్షించేలా స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి డిజిటల్ మెరుగులు అద్దాలని సంకల్పించారు. తమలో ఒకరైన ఎన్ఆర్ఐ స్నేహితుడితో ఆ ఆలోచనను పంచుకున్నారు. పుట్టినరోజు వేడుకలకు చేసే రూ.50వేల ఖర్చుతో డిజిటల్ తరగతి గది రూపకల్పనకు అవసరమైన డిజిటల్ పరికరాలు, ఆటబొమ్మలు సమకూర్చారు. సోమవారం దీనిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో ప్రారంభింపచేసేందుకు సిద్ధం చేశారు.


కడియం నుంచి చిరు సేవా సమితి అధ్యక్షుడు, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ గెద్దం శివరత్నగణపతి రూ.4 లక్షలు విలువ చేసే 12వేల మొక్కలను ఉచితంగా అందజేశారు. రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ తలపెట్టిన వన మహోత్సవంలో భాగంగా 'క్లీన్ పిఠాపురం.. గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి ఫల, అటవీ శాఖ మొక్కలు పంపుతున్నట్టు శివ వివరించారు.



పంపా వరద గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న నీరు

పంపా రిజర్వాయరు నుంచి 2వేల క్యూసెక్కులు సముద్రంలోకి

అన్నవరం, సెప్టెంబరు 1: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కు ఎగువ ప్రాంతాల నుంచి పంపా రిజర్వాయరుకు నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో రెండో నంబరు వరదగేటు ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాల పంట పొలాలు మునిగిపోయాయి. మరోపక్క వరద నీటి ప్రవాహం జాతీయ రహదారిపై ఉన్న నూతన నమూనాలయం వద్దకు చేరడంతో చుట్టూ ప్రహరీ నీటితో నిండిపోయింది. దీంతో జాతీయ రహదారిపైకి వరద నీరు ప్రవహించే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో జాతీయ రహదారిపై ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పంపా నీటిమట్టం 99 అడుగులు ఉంది.



జాతీయ రహదారిపై నమూనాలయం ప్రహరీ చుట్టూ నీరు

మరో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటున్న తల్లిదండ్రులు
- పలు కారణాలు చెప్తున్న వైద్యులు

చింతూరు, సెప్టెంబరు 1: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో ఆదివారం ఆరు రోజుల వయసు గల మరో శిశువు మృతి చెందింది. సరివెలకు చెందిన కణితి చిలకమ్మకు ఆగస్టు 27న పురిటి నొప్పులు రావడంతో వెంటనే ఆమె భర్త దుర్గారావు, అత్త లక్ష్మి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చిలకమ్మ ఆదే రోజు మగ శిశువుకు జన్మనిచ్చింది. 30న శిశువు కడుపు ఉబ్బుగా ఉందని గుర్తించిన వైద్యులు ప్రత్యేక వార్డులోకి మార్చారు. మరుసటి రోజు కూడా బిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో వైద్యులు ఆది వారం రాత్రి పదకొండు గంటల సమయంలో మెరుగైన చికిత్స అవసరమని భావించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాత్రంతా ప్రత్యేక వార్డులో ఉంచిన అక్కడి వైద్యులు ఆదివారం ఉదయం శిశువు పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ తరలించాల్సిందిగా తల్లిదండ్రులకు సూచించారు. అయితే వర్షాల కారణంగా భద్రాచలం నుంచి వరంగల్ వెళ్లేందుకు రహదారి సౌకర్యం సక్రమంగా లేదని తెలుసుకున్న తల్లిదండ్రులు తమ బిడ్డను హైదరాబాద్ తరలించేందుకు సిద్ధపడి అంబులెన్సు సిద్ధం చేసుకున్నారు. ఈలోపు బిడ్డ మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై తల్లిదండ్రులు మాట్లాడుతూ చింతూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు తమ బిడ్డ ఆరోగ్య పరిస్థితిని సకాలంలో గుర్తించకపోవడంతో చికిత్స చేయించే సమయం దొరక్క మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ముందుగానే చెప్పి వుంటే ఎంతైనా ఖర్చు చేసి తమ బిడ్డను బతికించుకునేవాళ్లమంటున్నారు.

ఈ విషయమై వైద్యుడు ఉమర్ వివరణ ఇస్తూ... బిడ్డకు పచ్చకామెర్లు, జ్వరంతో పాటు మలద్వార నిర్మాణం సక్రమంగా లేదన్నారు. మలం బయటకు వెళ్లే చోట ఆటంకం కలిగి మృతి చెందిందన్నారు.





మృతి చెందిన శిశువు, మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు చిలకమ్మ దుర్గారావు, నానమ్మ లక్ష్మి



రాత్రి వేళ తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డు మూసివేత

మోతుగూడెం, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ తులసిపాక నుంచి మారేడుమిల్లి వెళ్లే ఘాట్ రోడ్డును మూసివేస్తున్నట్టు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు. కొండచరియలు విరిగిపడే అవకాశం వున్న నేపథ్యంలో ఈ ఘాట్ రోడ్డులో వాహనాలను అనుమతించమన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

అత్తను చంపిన కోడలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 1: మండలంలో వృద్ధురాలైన అత్తను కోడలు హతమార్చింది. రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... కొండపల్లి గ్రామనికి చెందిన ఈక లక్ష్మి(65)ని ఆమె కోడలు జ్యోతి హత్య చేసింది. నిత్యం తనకు అక్రమ సంబంధాలు అంటకడుతోందనే కోపంతో జ్యోతి అత్త లక్ష్మిని బలంగా కొట్టడంతో చనిపోయింది.

మొల్ల విగ్రహావిష్కరణకు తరలిరావాలి

అంబాజీపేట, సెప్టెంబరు 1: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణకు కోనసీమలోని కుమ్మరి శాలివాహనులంతా తరలిరావాలని జిల్లా సంఘ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి అన్నారు. ఈనెల 4న మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆధ్వర్యంలో మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలపర్తి భీమేశ్వరరావు తరలిరావాలని తెలిపారు.


మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు

మెగా రక్తదాన శిబిరం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని అమలాపురం ఎర్రవంతెన వద్ద ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రారంభించారు. జనసేన సీనియర్ నాయకుడు చిక్కం భీముడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. రక్తదాతలను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, దెందుకూరి సత్తిబాబురాజు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పిండి అమరావతి, గండి దేవీహారిక, ఎంపీటీసీలు పనసా బుజ్జి, తాళ్ల లక్ష్మీనరసమ్మ, నాగులపల్లి కృష్ణవేణి, చిట్టినీడి శ్రీదేవి, రొక్కాల నాగేశ్వరరావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, చిక్కాల సతీష్, గండి స్వామి, ఆకుల బుజ్జి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1200 మందికి వైద్య పరీక్షలు

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు ద్వారా అమలాపురం ముస్లిం షాదీఖానా భవనంలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని జనసేన రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పరిశీలించారు. సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారంతో రెండు రోజుల్లోను సుమారు 1200 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నాయకులు కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, బట్టు పండు, ఇ. రఘుబాబు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్‌లో..

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని క్లీన్ ఆంధ్రా-గ్రీన్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఎ.వేమవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జనసేన ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. నాయకులు లింగోలు పండు, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, కొప్పుల నాగమానస, కంచిపల్లి అబ్బులు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, చిక్కం సుధ తదితరులు పాల్గొన్నారు.

కడలిలో మెగా రక్తదాన శిబిరం


యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు: కడలిలో గ్రామస్తులు, చిరుపవన్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని కడలి చిరుపవన్ ఫ్యాన్స్ మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 45 మంది రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, రాజోలు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాజోలు నియోజకవర్గ తెలుగురైతు ఉపాధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, గుండాబత్తుల తాతాజీ, సూరిశెట్టి శ్రీనివాస్, ఉలిశెట్టి లక్ష్మణరావు, వడ్లమూడి చిన్నీ, మామిడిశెట్టి నాగరాజు, కొండేపూడి నారాయణరావు, కోళ్ల బాబి పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు సత్కారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1: రామచంద్రపురం లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు. ఆది వారం లారీ ఓనర్సు అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి తల్లి స్వర్గీయ గన్నమని భానుమతి ట్రస్టుచే లారీ ఓనర్సు, వర్కర్లుకు టీషర్టులు మంత్రి సుభాష్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్‌ను యూనియన్ కార్యవర్గం సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి, కార్యదర్శి తోరం శ్రీనివాస్, కోశాధికారి కె.కుమార్, ఉపాధ్యక్షులు కొలగాని రామారావు, గుబ్బల గనిరాజు, మాధవరపు సత్తిబాబు, రవిశంకర్, గణేష్, ఎస్.నాగన్న, గణపతి, పల్లా సుధాకర్, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రక్షా జయంతి

యానాం, సెప్టెంబరు 1: యానాం మాజీ ఎమ్మెల్యే రక్షా హరికృష్ణ జయంతిని అధికారులు, మత్స్యకారసంఘ నాయకులు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెట్టకుర్రులోని మత్స్యకారపేటలోని ఆయన విగ్రహానికి మల్లాడి శామ్యూల్ పూలమాలలువేసి నివాళులర్పించారు.

రామచంద్రపురం ఎస్ఐగా వాసు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1: రామచంద్రపురం ఎస్ఐగా పి.వాసు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ వాసు ఏలూరు రూరల్ నుంచి బదిలీపై రామచంద్రపురం వచ్చారు.


పి.గన్నవరం: గంటిపెదపూడిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ


ముమ్మిడివరంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


గడియార స్తంభం సెంటర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

'కాలుష్య రహిత గ్రామాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

పి.గన్నవరం, సెప్టెంబరు 1: ప్రతి గ్రామాన్ని కాలుష్య రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురష్కరించుకుని మండలంలో ఏర్పాటు చేసిన పవన-వనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి అనంతరం మాట్లాడారు. కాలుష్యాన్ని నియంత్రించాలంటే చెట్లు ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం గంటిపెదపూడి నుంచి పి.గన్నవరం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతీ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు నూకపెయ్యి ప్రసన్నకుమార్, బండి మహలక్ష్మి, యర్రంశెట్టి శ్రీవేణి, బొండాడ నాగమణి, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, పల్లి మోసే, ప్రియదర్శిని, శిరిగినీడి వెంకటేశ్వరావు, చొల్లంగి సత్తిబాబు, వాసంశెట్టికుమార్, గణపతి వీరరాఘవులు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, కూటమి నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం: ప్రతీఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారాన్ని అందించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ఆదివారం ముమ్మిడివరం టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ రహదారికి ఇరుపక్కలా మొక్కలునాటే కార్యక్రమాన్ని దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. మొక్కలు నాటి ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి ఆక్సిజన్ శాతాన్ని పెంపొందించేందుకు మొక్కలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, గుద్దటి జమి, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు, అర్థాని శ్రీనివాసరావు, విళ్ల వీరాస్వామినాయుడు, దాట్ల బాబు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్టా సత్తిబాబు, దూడల స్వామి, గోదశి పుండరీష్, రంబాల రమేష్, జనిపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ అభిమానుల కార్ల ర్యాలీ

కాట్రేనికోన: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నేడు చెయ్యేరులో నిర్వహించే రక్తదాన శిబిరం, వనమహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదివారం పవన్ అభిమానులు కార్ల ర్యాలీ నిర్వహించారు. చెయ్యేరు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని ఆక్వారంగ నాయకుడు త్సవటపల్లి నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో త్సవటపల్లి మణికుమార్, నంద్యాల సురేంద్ర, బసవా మురళి, సంగీతం రాము, పోలిశెట్టి రాజు పాల్గొన్నారు.

ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ

అమలాపురం టౌన్: ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మొక్కలు పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని వివిధ రకాల మొక్కలను కడియపులంక నర్సరీ నుంచి తీసుకువచ్చి పంపిణీ చేశారు. ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అడ్డాల గోపాలకృష్ణ, యాళ్ల వెంకటానందం, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, కొత్తపల్లి వంశీ, ఆకి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పూజలు

వెంకన్న ఆలయంలో బండారు పూజలు

ఆత్రేయపురం, సెప్టెంబరు1: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,68,311 లభించినట్లు ఉపకమిషనర్, ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ పొలిటికల్ స్టంట్'

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: ఎస్సీ వర్గీకరణ కేంద్రంలోని బీజేపీ పొలిటికల్ స్టంట్ అని ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ఆరోపించారు. అమలాపురం అరిగెలపాలెంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆర్టికల్ 341ని సవరణ చేయకుండా వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు.

'విజనున్న మహోన్నత వ్యక్తి చంద్రబాబు'

ముమ్మిడివరం, సెప్టెంబరు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1995 సెప్టెంబరు 1వ తేదీన తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి 29 సంవత్సరాలు పూర్తయి 30 సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ముమ్మిడివరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

సీహెచ్ గున్నేపల్లిలో వేడుకలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎంగా తొలిసారి ప్రమాణ స్వీకారంచేసి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా సీహెచ్ గున్నేపల్లిలో కూటమి నాయకులు వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ యాళ్ల ఉదయ్ ఆధ్వర్యంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంవద్ద 30 కిలోల కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

మామిడికుదురు: సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారంచేసి 30వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా టీడీపీ నాయకులు ఆదివారం మామిడికుదురులో సంబరాలు జరిపారు. టీడీపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ కేక్ కట్‌చేసి


మామిడికుదురులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

వేడుకలు ప్రారంభించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈలి శ్రీనివాస్, ఉండ్రు శ్రీరామారావు, సాపే ఏకాదశి, నయినాల సత్యనారాయణమూర్తి, పెచ్చెట్టి విజయభాస్కరరావు, వాసంశెట్టి వెంకట్రావు, అప్పారి వెంకటేశ్వరరావు, ఇంటి గణపతి, కడలి రంగ, అప్పన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మామిడికుదురు, సెప్టెంబరు 1: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతీఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు రమ్యశైలజ, స్పందనలు పేర్కొన్నారు. పాశర్లపూడి గ్రామంలో లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి సర్వే చేస్తున్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

ముమ్మిడివరం, సెప్టెంబరు 1: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ముమ్మిడివరంలో వారంతా ర్యాలీ, నేతల విగ్రహాలకు పూలమాలలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక లంకతల్లెమ్మ గుడి సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి, పోలమ్మ చెరువుగట్టు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు తమకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న పదిహేనువేల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివారం మలికిపురం గాంధీ బొమ్మల సెంటర్‌లో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వీరికి రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సంఘీభావం తెలిపారు.

అంబాజీపేట: మద్యం పాలసీ మారుస్తున్న సందర్భంగా షాపుల్లో పనిచేసే సిబ్బందిని తొలగిస్తే రోడ్డున పడతామని సిబ్బంది స్థానిక సెంటర్‌లో నిరసన తెలిపారు. పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు చెందిన మద్యం షాపు సిబ్బంది సెంటర్ నుండి బస్టాండ్ వరకు ర్యాలి నిర్వహించారు.

పూర్వ విద్యార్థులను కలిసిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, సెప్టెంబరు 1: శివకోటి శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో 1972లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితులంతా ఎమ్మెల్యే దేవకు శాలువాలు కప్పి ఆయన జీవిత చరిత్రతో కూడిన జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.

లయన్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు

యానాం, సెప్టెంబరు 1: యానాం పిల్లారాయ నూతన కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం శుక్రవారంరాత్రి జరిగింది. స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ హాజరయ్యారు. జిల్లా గవర్నర్ డాక్టర్ బి.బాలకృష్ణ అధ్యక్షతన మాజీ గవర్నర్ వేలూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా డీవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా నల్లాం సురేష్, ట్రెజరర్‌గా కనకాల నరసింమూర్తి ఎంపికయ్యారు.

చంటిబాబు సేవలు ప్రశంసనీయం


పంచాయతీరాజ్ జిల్లా ఇంజనీరింగ్ అధికారి చంటిబాబు దంపతులకు సన్మానం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: పంచాయతీరాజ్ జిల్లా ఇంజనీరింగ్ అధికారి కవల చంటిబాబు పదవీ విరమణను పురస్కరించుకుని స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో వీడ్కోలు సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ 39 ఏళ్ల పాటు పనిచేసి ఎనలేని సేవలు అందించారని వక్తలు కొనియాడారు. చంటిబాబు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈలు అన్యం రాంబాబు, పీఎస్ రాజ్‌కుమార్, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అల్లాడ వెంకటరమణ, సామా బుజ్జి, బళ్ల బ్రహ్మాజీ, బొంతు బాలకృష్ణ, మోపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరుడికి లక్ష రుద్రార్చన


వీరేశ్వరుడికి రుద్రాక్షలతో పూజ, నల్లబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, సెప్టెంబరు 1: ఆదివారం మురమళ్ళ వీరేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష అర్చన జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో 15మంది రుత్విక్కులు శాస్త్రోక్తంగా ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారణాసి నుంచి తెచ్చిన రుద్రాక్షలకు గోదావరి జలాలతో సంప్రోక్షణ జరిపారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో ఎమ్మెల్యే దంపతులతోపాటు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ రుద్రాక్షలను ఊరేగించారు. ఈ పూజా కార్యక్రమాల్లో 880 మంది భక్తులు పాల్గొని గోత్ర నామాలతో పూజలు జరిపించుకున్నారు.

నల్లబాబుకు ఎమ్మెల్యే సత్కారం

వీరేశ్వరస్వామి ఆలయంలో జరిగే వివిధ పూజా కార్యక్రమాలకు విశేష సేవలందిస్తున్న నల్లబాబు సేవలు అభినందనీయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ళకు చెందిన నూలు వెంకటేశ్వరరావు(నల్లబాబు) గత కొంత కాలంగా ఆలయంలో పూజలకు సేవలందిస్తున్నారు. రుద్రాక్ష అర్చన కార్యక్రమానికి 420 టిక్కెట్లు విక్రయించి రూ.1.05 లక్షల ఆదాయం సమకూర్చారు. స్వామి పూజా కార్యక్రమాలకు స్థానికేతర ప్రాంతాల్లో నల్లబాబు విశేష ప్రచారం కల్పిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే బుచ్చిబాబు నల్లబాబును సత్కరించారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.31వేల విరాళం


దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి, సెప్టెంబరు 1 : నాగుల్లంక గ్రామానికి చెందిన పాలూరి సాహితీ కుటుంబ సభ్యులు ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.31వేలు విరాళంగా అందించారు. దాత సాహితీ కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

వినాయక మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో

వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాటు చేసుకునే మండపాలకు ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్సు విధానం అమలులోకి తీసుకువచ్చినట్టు పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం అయినవిల్లిలో నిర్వహించిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడుతూ గతంలో మండపాల ఏర్పాటు కోసం అగ్నిమాపకశాఖ పంచాయతీరాజ్, విద్యుత్, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉండేదన్నారు. ప్రజల వెసులుబాటు కోసం సింగిల్ విండో క్లియరెన్సును ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. భక్తులు సెల్ 7995095800కు వాట్సాప్ ద్వారా హాయ్ అనే సందేశం పంపిస్తే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన మొత్తం ప్రక్రియ తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. మీ సేవ ద్వారా తగిన రుసుము చెల్లించి రశీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఎస్‌హెచ్‌వో నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. సదరు పత్రం గణేష్ మండపంలో ఉండాలని, క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి తనిఖీ చేస్తారన్నారు. సమావేశంలో ఎస్ఐ కేఎన్ జోషి పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ

ముమ్మిడివరం, సెప్టెంబరు 1: ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌ను అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లా అండ్ ఆర్డరు అమలులో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌కు, సిబ్బందికి డీఎస్పీ పలు సూచనలిచ్చారు.

కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు



ముమ్మిడివరం, సెప్టెంబరు 1: ఇంటి నుంచి వెళ్లిపోయిన తన కుమారుడు తిరిగి రాలేదని తల్లి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముమ్మిడివరం మండలం రాణేలంక గ్రామానికి చెందిన బొంతు మోహనశివసందీప్‌కు, అతని భార్య త్రివేణిలకు మధ్య కొంత కాలంగా వివాదం కొనసాగుతుంది. దీంతో భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. గతనెల 29న శివసందీప్ ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయటికి వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని అతని తల్లి చంద్రావతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కారంకి



ఆత్రేయపురం, సెప్టెంబరు 1: ఆత్రేయపురం మండలం పులిదిండి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం-1 ఉపాధ్యాయుడు కారంకి సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన మంత్రులు, కలెక్టర్ చేతులు మీదుగా జిల్లా కేంద్రం అమలాపురంలో అవార్డును అందుకోనున్నారు. 26 ఏళ్లుగా నిరంతరం విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతున్న సత్యనారాయణను ఎంపీడీవో నాతి బుజ్జి, ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్ అభినందించారు.

బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పి.గన్నవరం, సెప్టెంబరు 1: మండలంలోని వైవిపాలెంలో గ్రామస్తులు నూతనంగా ఏర్పాటుచేసుకున్న బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం అవసరమని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.భారతీ, సర్పంచ్ యర్రంశెట్టి శ్రీవేణి, యర్రాప్రగడ గోపి, తుండూరి బుజ్జి, షేక్ దొరబాబు, నార్ని సత్తిపండు, సిద్దిరెడ్డి సత్తిబాబు,సాయిబాబు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1 :రామచంద్రపురం పట్టణం స్టీల్‌వెల్‌పేటకు చెందిన యువతి అదృశ్యంపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్టీల్‌వెల్‌పేటకు చెందిన యువతి సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తోంది. గతనెల 31న ఉదయం 5గంటల సమయంలో తల్లి నిద్రలేచి చూడగా కుమార్తె కనిపించలేదు. పలుచోట్ల గాలించి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో వేదస్వస్తి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1:వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రపురంలో వేదప్రవచనం, 150 మంది పండితులు, ఘనాపాఠీలచే వేదస్వస్తి జరిపారు. ముందుగా అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో వేదసభ ప్రారంభించారు. రాజమహేంద్రవరం దత్తాత్రేయ వేదవిద్యాగురుకుల పాఠశాల వ్యవస్థాపకుడు గొల్లపల్లి సతీరామచంద్ర ఘనాపాఠి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. 24 ఏళ్ల కృషి ఫలితంగా ఘనపట్టా పొందిన పైడిమర్రి మురళి ఘనాపాఠి, పైడిమర్రి చంద్రశేఖర్ ఘనాపాఠీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ పురోహితులు, బ్రహ్మణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై ఆరోపణలు అవాస్తవం

కె.గంగవరం, సెప్టెంబరు 1: మండలంలోని భట్లపాలిక యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనపథకం అమలు నిర్వాహకులపై వచ్చిన ఆరోపణలు వాస్తవంకాదని పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. గత 22 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజనం నిర్వాహకులుగా పనిచేస్తున్న గెడ్డం లక్ష్మిపై వ్యక్తిగత కక్షతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ అయిన కట్టా తిరుమలరావు, వైసీపీ నాయకులు ఎంపీటీసీ జల్లెళ్ల బాల సుబ్రహ్మణ్యం, శీలం గోవిందు, కాటే ఏడుకొండలు తదితరులు కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్‌కు, స్థానిక విద్యాశాఖ అధికారికి లిఖిత పూర్వక అర్జీ అందజేస్తామని చెప్పారు.

దూరాభారమైనా..


కోడేరులో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వీరన్న

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: అమలాపురం 6వ వార్డులో నివాసం ఉంటే కురసాల రత్నం ప్రతీనెల ప్రభుత్వ పెన్షన్‌ను పొందుతుంది. ఆమె తీవ్ర అనారోగ్యంతో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరులో ఉన్న కుమారుని ఇంటి వద్ద ఉంటూ వైద్య సేవలు పొందుతోంది. రత్నం కుమారుడు వెంకటరత్నం తన తల్లి పరిస్థితిని సచివాలయ కార్యదర్శి బండి వీరన్న దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీరన్న జోరువానలో పడవ ప్రయాణం చేసి ఆమె వద్దకు చేరుకుని రూ.4వేలు పెన్షన్ అందజేశారు. రత్నం కుటుంబ సభ్యులు వీరన్నతో పాటు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిట్టబ్బాయి జయంతి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1: అమలాపురం మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి జయంతిని పురస్కరించుకుని గడియార స్తంభం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మాజీమంత్రి పినిపే విశ్వరూప్‌తో పాటు పలువురు నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో చిట్టబ్బాయి కుమారుడు భరత్‌భూషణ్ మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మాజీ జడ్పీటీసీ కుడుపూడి బాబు, కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, సంసాని బులినాని, బొంతు గోవిందుశెట్టి, దంగేటి రుద్ర, చెల్లుబోయిన శ్రీనివాస్, వంటెద్దు వెంకన్నాయుడు పాల్గొన్నారు.

